## డెంగ్యూతో చిన్నారి మృతి



రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతురు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రిషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

## స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం



మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతురు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.



సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

# కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

**2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు • 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా? • మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్**

**రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం • ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే • బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉప ముఖ్యమంత్రి చెప్తున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టాలిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

### మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

### రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్‌ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

### వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

### నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగొడుతామంటే బీఆర్‌ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

### ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింతమడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చున్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

### కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.



హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

## కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

## 3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

## • తాగునీటి కోసం గిరిజనుల నిరసన



మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ అభిలాష్

## జాతీయస్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 30: హైదరాబాద్‌లో ఆదివారం జాతీయ స్థాయి ఓపెన్ టూ ఆల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ 2024 పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లాకేంద్రానికి చెందిన సన్ షైన్ స్కూల్ విద్యార్థులు రాజేశ్వరి, అభిలాశ్ ప్రతిభ చూపి ప్రథమ బహుమతులు అందుకున్నారు. సోమవారం పాఠశాలలో కరస్పాండెంట్ అభిలాశ్, ప్రిన్సిపాల్ సాధన విద్యార్థులను అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు రాంనగర్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న జీహెచ్‌ఎం అంజలీదేవి

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని రాంనగర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు బాల, బాలికలు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం మక్తల్ మండలంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపగా, ఈనెల 3నుంచి 5వ తేదీవరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు పీఈటీ పుష్ప తెలిపారు. సోమవారం రాంనగర్ పాఠశాల జీహెచ్‌ఎం అంజలీదేవి, మహేశ్వరమ్మ, ఉపాధ్యాయులు అభినందించి, రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాలని ఆకాంక్షిచారు.

## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

హన్వాడ, సెప్టెంబర్ 30: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తాసీల్దార్ కిష్ట్యానాయక్ అన్నారు. ఈనెల 26వ తేదీన మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి కొత్తపేట, రెండో బహుమతి చిన్నదర్‌పల్లి పాఠశాలల విద్యార్థులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్, మాజీ ఎంపీటీసీ నాగన్న, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కిష్ట్యానాయక్, బీసీ ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అధికారులు

# పోలేపల్లి జీపీలో రూ.1.73కోట్ల అవినీతి ?

జడ్చర్ల, సెప్టెంబర్ 30 : మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీలో రికార్డుల ట్యాంపరింగ్‌లో రూ.1.73కోట్ల అవినీతి జరిగినట్లు అధికారుల విచారణలో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. పోలేపల్లి గ్రామపంచాయతీలో గత ఐదేండ్ల పాలకవర్గ పాలనలో మొత్తం రూ.6కోట్ల నిధులతో గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు జరిగినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు ఖర్చుపెట్టిన నిధులకు ఎలాంటి పొంతన లేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శివప్రసాద్ ఇటీవల బదిలీ అయ్యాడు. ఆయన స్థానంలో పోలేపల్లి కార్యదర్శిగా లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. అయితే లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించినా శివప్రసాద్ రెండు నెలలుగా రికార్డులు ఇవ్వకుండా ఉండటంతో లక్ష్మీనారాయణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా తెలియజేశారు. దాంతో ఎమ్మెల్యే ఎంపీడీవో, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా రికార్డులను అప్పగించకపోవడంతో నిధుల వినియోగంలో అవినీతి, అక్రమాలను సరిదిద్దేందుకే రికార్డులను ఇవ్వడం లేదన్న అనుమానంతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పోలేపల్లి పంచాయతీలో రికార్డుల ట్యాంపరింగ్ జరుగుతుందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ చేయాలని డీఎల్‌పీను ఆదేశించారు. దీంతో విచారణ అధికారిగా డీఎల్‌పీవో పండరీనాథ్‌ను నియమించారు. డీఎల్‌పీవో పోలేపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో సరోజ, ప్రస్తుత కార్యదర్శి లక్ష్మీనారాయణ, గతంలో పనిచేసిన కార్యదర్శి శివప్రసాద్ సమక్షంలో విచారణ చేశారు. ఈ విచారణలో రూ.1.73కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చినట్లు తెలిసింది. ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారని తెలిసింది.



జడ్చర్ల మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తున్న డీఎల్‌పీవో పండరీనాథ్(ఫైల్)

## పీయూ అధ్యాపకులకు అవార్డులు, పీహెచ్‌డీలు



ఎం.మధును సన్మానిస్తున్న పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 30: పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులకు అవార్డులు వరించడంతో పాటు పీహెచ్‌డీలు పొందారు. ఈ సందర్భంగా సోమవారం వారిని పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, వివిధ విభాగాల అధ్యాపకులు అభినందించారు.

### ఫెలోషిప్ అవార్డు

ఫార్మారంగంలో అకాడమిక్ పరిశోధనలో చేసిన విశేష సేవలకు గుర్తింపుగా అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా అవార్డు ప్రకటిస్తుంది. ఈ ఏడాది పీయూ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు ప్రభాకర్‌రెడ్డికి ఈ అవార్డు వరించింది. ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్ అవార్డు రావడం పాలమూరు వర్సిటీకి గర్వకారణమని వక్తలు పేర్కొన్నారు.

### ఇద్దరు అధ్యాపకులకు పీహెచ్‌డీలు

పాలమూరు యూనివర్సిటీ గణితశాస్త్రం విభాగం అధ్యాపకుడిగా పనిచేస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లికి చెందిన మధు సోమవారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నుంచి డా.మద్దిలేటి పర్యవేక్షణలో డాక్టరేట్ పొందారు. పీయూ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి తండాకు చెందిన డా.జయనాయక్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ మేరీ సునంద పర్యవేక్షణలో అత్యున్నత డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి

**• ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ పోటీలు ప్రారంభం**



రెజ్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

ధన్వాడ, సెప్టెంబర్ 30 : క్రీడాకారులు తమ సత్తాను రాష్ట్రస్థాయిలో చాటాలని ఎంఈవో గాయిత్రి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా బాల, బాలికల రెజ్లింగ్ పోటీలను ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మట్లాడుతూ.. అండర్–14,17,19 విభాగాల్లో నిర్వహిస్తున్న రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయికి ఎదగాలని అన్నారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయిట పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 3నుంచి 5వ తేదీ వరకు ధన్వాడలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహయ్యాచారి, పీఈటీలు రవి, నెల్సన్, రామ్మోహన్‌గౌడ్, అనంతసేనా, సాయినాథ్, రెజ్లింగ్ కోచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు కున్సి విద్యార్థులు

మాగనూరు/ కృష్ణ, సెప్టెంబర్ 30: రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు కృష్ణ మండలంలోని కున్సి పాఠశాల విద్యార్థులు రఘు, బాబు, నింగమ్మ ఎంపికైనట్లు జీహెచ్‌ఎం సంతోషి, పీడీ సౌమ్య తెలిపారు. మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఈనెల 29వ తేదీ రాష్ట్ర షూటింగ్ బాల్ ఉపాధ్యక్షుడు విశ్రాంత పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ బాల, బాలికల ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన బాల, బాలికలు ఈనెల 3నుంచి 5వతేదీ వరకు నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ తెలిపారు.



రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

ఊట్కూర్, సెప్టెంబర్ 30: చదువుకున్న ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే పీడీఎస్‌యూ 50వ స్వర్ణోత్సవ సభలకు మండలంలోని బిజ్వారం, చిన్నపొర్ల, పెద్దపొర్ల నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైనట్లు ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రమేశ్, కృష్ణ, పరమేశ్, ఆంజనేయులు, పరశురాం, ప్రవీణ్ పాల్గొన్నారు.

## రైతులకు అధిక రుణాలు అందజేస్తాం

హన్వాడ, సెప్టెంబర్ 30: హన్వాడ రైతు సేవా సహకార సంఘం బ్యాంకును మహబూబ్‌నగర్ డీసీసీబీలో విలీనం చేసిన తర్వాత రైతులకు అధిక సంఖ్యలో రుణాలు అందజేస్తామని సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బ్యాంకులో 35 జీపీల నుంచి 5,618మంది రైతులకు సభ్యత్వం ఉందన్నారు. రైతుల రుణామాఫీ కోసం ప్రభుత్వానికి 450మంది పేర్లు పంపించగా.. 220మందికి రుణమాఫీ వచ్చిందన్నారు. ఎస్‌బీఐలో 9.65శాతం వడ్డీకి రుణాలు ఇస్తుందని, డీసీసీబీలో విలీనం తర్వాత 4.1శాతం వడ్డీతో రైతులకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాసులు, చెన్నయ్య, ఆంజనేయులు, రవి, తిర్మల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

దామరగిద్ద, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన యువజన ఉత్సవాల్లో మండలానికి చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటోమెటిక్ స్టాప్ గేట్ ఓవర్ ఫ్లో ఎట్ బ్రిడ్జెస్ అనే ప్రాజెక్టును ప్రదర్శించి మొదటి బహుమతిని అందుకున్నారు. దీంతోపాటు జనవరిలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొంటారని, విద్యార్థుల ప్రతిభను వెలికితీసిన ఉపాధ్యాయులు అమృత్ తిప్పణ్ణ, సక్సేనా, శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం అశోక్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారని ఉపాధ్యాయులు శంభులింగం తెలిపారు.

## డీఎస్సీలో పలువురి ప్రతిభ

ఊట్కూర్, సెప్టెంబర్ 30: ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన 2024 డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని ఎడవెల్లికి చెందిన ప్రియాంక ఎస్జీటీలో 87.37 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో కొలువు దక్కించుకుంది. అలాగే కొల్లూరుకు చెందిన స్వప్న గణితంలో 87.33 మార్కులు, ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన ప్రదీప్ తెలుగు పండిట్ జిల్లా స్థాయి రెండో ర్యాంకు, చామకూర మహేశ్ ఎస్జీటీలో 37వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ కొలువులకు ఎంపికయ్యారు. వీరిని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందించారు.

## సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలి

నవాబ్‌పేట, సెప్టెంబర్ 30: సహకార సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని నవాబ్‌పేట సింగిల్‌విండో అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. సోమవారం సహకార సంఘం భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రుణమాఫీ పొందిన రైతులందరికీ కొత్త రుణాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే ఎరువులు, విత్తనాల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రతాప్, శశిధర్‌రెడ్డి, అంజయ్య, వెంకటేశ్, నాయకులు లక్ష్మయ్య, యాదయ్య, చెన్నయ్య, గోపాల్‌రెడ్డి, సహకార సంఘం కార్యదర్శి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సహకరిస్తేనే సహకార సంఘం అభివృద్ధి

బాలానగర్, సెప్టెంబర్ 30: రైతులు సహకరిస్తేనే సహకార సంఘం అభివృద్ధి సాధిస్తుందని బాలానగర్ పీఏసీసీఎస్ అధ్యక్షుడు పట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం బాలానగర్ సహకార సంఘ భవనం ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సహకార సంఘం ఆవరణలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను త్వరలో ప్రారంభిస్తామని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక చేస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## సింగిల్‌విండో అభివృద్ధికి సహకరించాలి

భూత్పూర్, సెప్టెంబర్ 30: సింగిల్‌విండోల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని చైర్మన్ అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో మహాజనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి నుంచి ఖర్చులు, జమ అంశాలను వివరించారు. సొసైటీ ద్వారా 88మందికి రైతులకు రూ.67,27,821ల రుణాలను అందజేయగా, 52మంది రైతులకు రూ.33,19,237లు రుణమాఫీ అయినట్లు తెలిపారు. మిగిలిన రైతులకు సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని తెలిపారు. సింగిల్‌విండోలు కమర్షియల్ బ్యాంకులకు దీటుగా రుణాలను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు తిరిగి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రత్నయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాసులు, ఆడిటర్ వేణుగోపాల్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## అంటరానితనం నిర్మూలించాలి

నారాయణపేట, సెప్టెంబర్ 30: గ్రామాల్లో ఉన్న అసమానతలు, అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పోలీసు, రెవెన్యూ అధికారులు తెలిపారు. సోమవారం జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కులమతాల తేడా లేకుండా ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పోలీస్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.